క్లుప్తంగా

ప్రజాజీవితాల్లో సంక్షేమ కాంతులు



ఉయ్యూరు: ప్రజా జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయులు జోగి రాజీవ్, జోగి రోహిత్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. పెనమలూరులో తన తండ్రి జోగి రమేష్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెత్తం అనుపమ, నాయకులు వేణుబాబు, గెత్తం విజయ్‌కుమార్, నందం జోగేశ్వరరావు పాల్గొన్నారు.

మండలంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

విజయవాడరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 2.70 కోట్లను విడుదల చేసినట్లు విజయవాడరూరల్ మండల వ్యవసాయాధికారి బి.రంగనాథబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ వల్ల మండలంలోని 1,673 మంది రైతులకు సంబంధించి 1,593 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. తుఫాన్‌లో దెబ్బతిన్న పంట పొలాలను ప్రత్యేక అధికారుల బృందం పరిశీలించి పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిక ద్వారా తెలియజేసింది. నివేదిక ప్రకారం ప్రభుత్వం ఎకరానికి రూ. 6,800 చొప్పున నష్ట పరిహారాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరిగిందని ఏఓ పేర్కొన్నారు.

ఎస్సార్కేలో ఉత్సాహంగా ఎక్స్‌ప్లోరర్స్ మీట్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఎక్స్‌ప్లోరర్స్ మీట్-2కే24 గురువారంతో ముగిసింది. రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొని ఆయా విభాగాల్లో ప్రదర్శనలిచ్చారు. ఈ టెక్నికల్ మీట్‌లో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, మోడల్ మేకింగ్ వంటి విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. ఎస్సార్కే కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏ కాంబరంనాయుడు మాట్లాడుతూ మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ద్వారా అద్భుతాలు సాధించగలుగుతున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, ఫెస్ట్ కోఆర్డినేటర్, ఈఈఈ హెచ్‌ఓడీ ఎస్.నాగేశ్వరరావు, ఏఓ ప్రతాప్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఒక రోజు ముందుగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపారు. హైస్కూల్ పూర్వవిద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళా ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని సన్మానించారు. ఈ వేడుకల్లో ఎంఈఓల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, జ్యోతిష్య నిపుణుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణీకుమార్, జాతీయ మానవ హక్కులు, నేరనిరోధక మండలి రాష్ట్ర మహిళా విభాగం ఛైర్‌పర్సన్ చిగురుపాటి లక్ష్మి తదితరులు పాల్గొని మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలో, సమాజంలో మహిళలకు ఉన్న ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. మహిళల పట్ల వివక్షత చూపకూడదని, ప్రతీ ఒక్కరిని సోదరి, తల్లిలా గౌరవంగా చూడాలని తెలిపారు. చిగురుపాటి లక్ష్మి మాట్లాడుతూ తాను కూడా పూర్వ విద్యార్థుల్లో ఒక భాగమైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఆమె మూలస్తంభంగా మహిళల పాత్రను వివరించారు. వేడుకల్లో హైస్కూల్ హెచ్‌ఎం వజ్రాల భూపాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, మహిళా ప్రతినిధులు యర్కారెడ్డి కనకదుర్గ, బొంతు రమాదేవి, హైస్కూల్ అసిస్టెంట్ ఎస్.రవిప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గన్నవరం సివిల్ కోర్టు జడ్జి కె.జయలక్ష్మీ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి జయలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు రాజకీయ, సామాజిక, ఆర్థిక స్వాలంబన సాధించేందుకు రాజ్యాంగం హక్కులను కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా స్త్రీ విద్యకు ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. అప్పుడే మహిళలు స్వశక్తితో ఉన్నతంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం పలువురు సచివాలయ మహిళా సంరక్షక కార్యదర్శులను సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య అధ్యక్షతన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీ శిరీష, సీఐ ప్రసాద్, ఎంపీడీఓ సత్యకుమార్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మాధవీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి



నున్నలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు



కేకు కట్ చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..

గన్నవరం: స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారితో పాటు పలువురు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ మహిళలకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా మహిళా కార్యదర్శులు సూరెడ్డి మణిమ్మ, కే అరుణకుమారి, సర్పంచ్‌లు జీ విజయలక్ష్మి, కొలుసు శిరీష, జేజమ్మ, పలువురు ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్‌సెల్ కన్వీనర్ ఆర్.భార్గవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ట్రైనీ డీఎస్పీ శ్రీవేద పాల్గొన్నారు. కళాశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ రాజశేఖర్, మహిళా ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బ్యాంక్ కాలనీలో గురువారం జాస్పర్ మహిళా ఉత్సవ్ సంబరాలు నిర్వహించి జాస్పర్ ఇండస్ట్రీస్ వివిధ విభాగాల్లో పని చేస్తున్న మహిళలకు బహుమతులు అందజేశారు. జాస్పర్ ఇండస్ట్రీస్ చైర్మన్ బాడిగ రామకృష్ణ సతీమణి ప్రేమలత మాట్లాడుతూ ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని మహిళలు ముందుకు వెళ్లాలని సూచించారు. బసంతి సురేష్, మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రెసిడెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మహిళలకు స్ఫూర్తిదాయకురాలు నూకల వెంకటసుబ్బమ్మను స్మరిస్తూ 40 మంది మహిళలను సత్కరించారు. లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్, సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకటసాంబశివరావు, డాక్టర్ తేజస్విని, శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, మహిళా స్ఫూర్తి అధ్యక్షురాలు భువనేశ్వరి, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్, డిగ్రీ ప్రిన్సిపాల్ శ్రీరామ్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఎస్‌బీఐలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందిని సత్కరించారు. మేనేజర్ అనూష, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో బాలిక విద్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. బాలిక విద్యాభివృద్ధి అధికారి భారతి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి

మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. కంకిపాడు పట్టణంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 4,193 మంది లబ్ధిదారులకు రూ. 7.86 కోట్ల చెక్కును అందించారు. 2,349 మంది లబ్ధిదారులకు జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసి దస్తావేజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్‌తో మహిళలకు పథకాలను క్రమం తప్పకుండా అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న ఒక్కరేనన్నారు. నవరత్న పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పాటుపడుతున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

సీఎంగా మళ్లీ జగన్‌ను గెలిపించుకుందాం..

ఎంత మంది కలిసొచ్చినా మళ్లీ సీఎం వైఎస్ జగనే అని మంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన, ఇతర పక్షాలు అన్ని ఒక్కటై వచ్చినా రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అండగా ఉన్న మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇచ్చి గెలిపించుకుంటానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, కమ్మ, సగర, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, నందిపాటి బిందు మాధవి, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ సునీల్‌కుమార్, మైనార్టీ నేత షేక్ చిన్నా, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

• ఉత్సవాలకు సంసిద్ధం





మహాశివరాత్రి వేడుకలకు యనమలకుదురు శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయం ముస్తాబైంది. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరగనుంది. రాత్రి ప్రభోత్సవం నిర్వహిస్తారు. ఇందుకుగానూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు పేరంటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలోని శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివార్లకు పలు రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. దాతల సహకారంతో ఉదయం 10.30 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులు, బాటసారులకు ఉచిత మజ్జిగను అందజేస్తామని వివరించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషినల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు అన్నారు. యనమలకుదురులో గురువారం ఆయన సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

శివరాత్రి సందర్భంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. పోలీసు సిబ్బంది జాగ్రత్తగా ఉండి వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ ఆర్జీ జయసూర్య మాట్లాడుతూ మహాశివరాత్రికి లక్ష మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభోత్సవం సందర్భంగా ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులను క్యూ మార్గం ద్వారానే అనుమతించాలని అన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

భారీ బందోబస్తు..

యనమలకుదురులో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐదు మంది డీఎస్పీలు, సీఐలు 12 మంది, ఎస్‌ఐలు 30 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 100 మంది, కానిస్టేబుళ్లు 170 మంది, హోంగార్డులు 160 మంది, పోలీసు ప్రత్యేక పార్టీలు బందోబస్తులో ఉంటారని పేర్కొన్నారు. సమావేశంలో డీటీసీ డీఎస్పీ రమేష్, గుడివాడ డీఎస్పీ మాధవ్, పెనమలూరు సీఐ టీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలపై ప్రత్యేక నిఘా

కంకిపాడు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ డీ సందీప్ తెలిపారు. మండలంలోని కుందేరు గ్రామంలో దాతల సహకారంతో గురువారం ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. పనులను ఎస్‌ఐ సందీప్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నేరాలను అదుపు చేసేందుకు, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అన్ని గ్రామాలు, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు.

విద్యార్థి వైద్యానికి వాకర్స్ ఆర్థిక సాయం

గన్నవరం: అంతు చిక్కని వ్యాధితో బాధపడుతున్న స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల విద్యార్థి వెలగపూడి శ్రీకర్‌కు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. ఈ మేరకు గురువారం శ్రీకర్ వైద్య చికిత్సల నిమిత్తం అతని తల్లి లక్ష్మీమానసకు అసోసియేషన్ ద్వారా రూ. 7,500 అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ శ్రీకర్ వైద్యానికి తమ వంతు సాయం అందించేందుకు తమ మిత్రబృందం స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, సభ్యులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర, కృష్ణమూర్తి, సీతారామయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కవ్వింపు చర్యలు



రామవరప్పాడు: గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ తన వ్యక్తిగత పనుల నిమిత్తం కాన్వాయ్‌లో విజయవాడ నగరానికి వెళ్తుండగా ఎనికేపాడులో టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగారు. ఎమ్మెల్యే వంశీ కాన్వాయ్‌ను టీడీపీ, జనసేన నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇక్కడ నిరసన వద్దని పోలీసులు సూచించినా టీడీపీ, జనసేన నాయకులు పెడచెవిన పెట్టి వివాదానికి కేంద్రంగా మారారు.

బాలికలకు అండగా ఉండాలి

పెనమలూరు: బాలికలకు సమాజంలో అందరూ అండగా ఉండాలని వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్ అన్నారు. గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం రఘురామ్ మాటాడ్లుతూ కిషోర బాలికలకు సమాజంలో భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌లు 1098, 112, 181, 100 అత్యవసర సమయాల్లో ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేసిన రోటరీక్లబ్

గన్నవరం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 750 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరంశాఖ ద్వారా పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. గురువారం రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జాస్తి విజయభూషణ్‌కుమార్, నర్రా సీతారామారావు చేతుల మీదుగా పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ వంతు చేయూతనందించినట్లు చెప్పారు. ఆర్థిక విశ్లేషకుడు గన్నె వెంకట్రావు, రోటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

గన్నవరం రూరల్: మహాశివరాత్రి మహోత్సవాలకు మండలంలోని ముస్తాబాద, చిక్కవరం శివాలయాలు ముస్తాబు అయ్యాయి. ముస్తాబాద భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి గుహాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సందర్శన కోసం ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఉదయం మహారుద్రాభిషేకం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రాత్రికి స్వామివారి దివ్య శాంతి కల్యాణం జరుగుతుందని చెప్పారు.

తానా ప్రధాన కార్యదర్శి రాజాకు అభినందన

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారి స్వగ్రామం బాపులపాడు మండలం వీరవల్లికి విచ్చేసిన ప్రవాస భారతీయుడు కసుకుర్తి రాజాను పలువురు అభినందనలతో ముంచెత్తారు. గురువారం కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

పీఏసీఎస్ అభివృద్ధికి రూ. 2.50 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అభివృద్ధికి ఆ సంఘం చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ రూ. 2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా పీఏసీఎస్ సీఈఓ లోకేశ్వరరావుకు గురువారం అందించారు. తిప్పనగుంట మాజీ సర్పంచ్ మూల్పూరు వెంకటరెడ్డి, లక్ష్మీదేవమ్మ జ్ఞాపకార్థం వారి మనవడు, పీఏసీఎస్ చైర్మన్ ప్రభుకాంత్ అందజేశారు. సర్పంచ్ కలపాల భీమయ్య, గ్రామ ప్రముఖులు కాకాని బలరామకృష్ణ, సురేష్, శివాజీ, శ్రీధర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీ చేతుల మీదుగా విరాళాన్ని అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రభుకాంత్

సంక్షిప్త వార్తలు

■ విద్యార్థులు సమాజసేవ చేయాలి

పెనమలూరు: విద్యార్థులు సమాజసేవపై దృష్టి పెట్టాలని వణుకూరు గ్రామ సర్పంచ్ చక్క విజయ అన్నారు. వణుకూరు గ్రామంలో గత వారం రోజులుగా నలంద డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ముగింపు రోజు సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ విజయ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం రఘురామ్, వైఎస్సార్ సీపీ నేతలు గోపీకృష్ణ, నాగరాజు, దుర్గారావు, భాను, కిషోర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

■ దూసరపాలెంలో ఫ్లెక్సీలు ధ్వంసం

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు శివారు దూసరపాలెం వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి జోగి రమేష్ బ్యానర్లను అభిమానులు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఫ్లెక్సీలను తగుల పెట్టారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పీ నాగకుమార్, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణకుమారి, పార్టీ నాయకుడు గంజి సుభాకర్‌లు పోలీసులకు పిర్యాదు చేశారు.

■ ఘనంగా బాష్యం బ్లూమ్స్ వార్షికోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పోరంకిలోని బాష్యం బ్లూమ్స్ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ముఖ్య అతిథులుగా ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావు, బుల్లి తెర వ్యాఖ్యాత, సినీ దర్శకుడు ఓంకార్ హాజరయ్యారు. విద్యా సంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజ్ అధ్యక్షత జరిగిన ఈ వేడుకల్లో భాష్యం ఐఐటీ, జేఈఈ అకాడమి ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్, జడ్ఈఓ వరలక్ష్మి, విజయవాడ జేడీఓ జోషి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు సత్తా చాటారు. చిలకలూరిపేటలో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో ఉయ్యూరు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, డీన్ మణికుమార్, కోచ్ రామకృష్ణ అభినందించారు.

■ మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

పెనమలూరు: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు అన్నారు. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు మత్తు పదార్థాల దుర్వినియోగంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మత్తుతో చెలగాటం వద్దని మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని హెచ్చరించారు. సంస్థ ప్రతినిధులు జె.జ్యోతిచంద్రిక,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

■ పెదపులిపాక ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తుల కోసం పెదపులిపాక ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్నానాలు చేసే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గుడారాలు కూడా సిద్ధం చేశారు. పితృదేవతలకు పిండ ప్రదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

